ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 14 జులై 2025



### అవయవదానంతో ఆదర్శం


కృష్ణ (ఫైల్)

కంప్లి, జూలై13(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని కొత్త దరోజీ గ్రామానికి చెందిన కృష్ణ (36) తన శరీరంలోని అవయవాలను మరొకరికి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న కృష్ణ బెంగళూరులోని మింటో ఆప్తలోమిక్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన అవయవదానానికి అంగీకరించి కన్ను మూశారు. కృష్ణ మృతితో కుటుంబీకులు, స్నేహితులు దిగ్ర్భాంతికి గురయ్యారు.


సిగందూరు కేబుల్ వంతెన

## సిగందూరు ద్వీపానికి
# కేబుల్ బ్రిడ్జ్

- విస్తీర్ణంలో దేశంలో నాలుగో అతిపెద్ద వంతెన
- నేడు జాతికి అంకితం చేయనున్న కేంద్ర మంత్రి గడ్కరీ

బెంగళూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేరనుంది. చౌడేశ్వరీ అమ్మవారి దర్శనానికి వెళ్లాలనుకున్న భక్తులకు మార్గం సుగమం కానుంది. కేవలం జలప్రయాణ అవకాశం మాత్రమే ఉన్న సిగందూరుకు దేశంలోనే నాల్గవ అతి పెద్ద కేబుల్ వంతెన నిర్మాణం పూర్తి అయి ప్రారంభం కానుండం విశేషంగా మారింది. రాష్ట్రంలో ఎన్నో పవిత్రమైన ఆలయాలు ఉన్నాయి. వాటన్నింటికీ ఒక్కో ప్రత్యేకమైన చరిత్ర ఉంది. కొప్పళ జిల్లాలో కొండపైన ఆంజనేయస్వామి ఆలయం, ఏడాదికోసారి మాత్రమే తెరిచే హాసన్‌లోని హాసనాంబ ఆలయం ఇలాంటి ఆలయాలు కోకొల్లలుగా ఉన్నాయి. శివమొగ్గ జిల్లా పరిధిలోని శరావతి నదికి అనుబంధంగా సుదూరంలోని సిగందూరుకు అనుబంధంగా 2కిలోమీటర్ల దూరంలోని ఓ ద్వీపంలో చౌడేశ్వరి దేవి ఆలయం ఉంది. దశాబ్దాల కాలంగా ఇక్కడ నిత్యపూజలు కొనసాగుతాయి. అయితే శరావతి నది పొంగి ప్రవహించినా, వేసవిలో నీటిమట్టం అడుగంటినా అటువైపు భక్తులు వెళ్లేందుకు అవకాశం ఉండదు. ఏళ్ల తరబడి లాంచీ ద్వారా భక్తులు అమ్మవారికి దర్శనానికి వెళ్తుంటారు. ఉదయం నుంచి ఎన్నిసార్లు లాంచీలు తిరిగినా 5 గంటలకు వాపసు వచ్చే సమయానికి గట్టుకు ఇవతలకు చేరుకోవాల్సిందే. అటువంటి పరిస్థితి భక్తుల మనసును కలచివేసేది. రాత్రివేళ ఆలయంలో బస చేయాలని, కాసేపు గుడివద్ద ఉండాలని భావించే భక్తులకు వీలుండేది కాదు. అయితే బీజేపీ అగ్రనేత మాజీ సీఎం యడియూరప్ప సిగందూరు ఆలయానికి కేబుల్ బ్రిడ్జ్ నిర్మించేందుకు పూనిన శపథం నెరవేరింది. ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగినప్పుడు కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించుకోవడంలో సఫలీకృతులయ్యారు. శరావతి నది నుంచి లింగనమక్కి ఆనకట్ట అనుబంధంగా ఉంది. లింగనమక్కి బ్యాక్‌వాటర్‌లో ఉండే ఓ ద్వీపంలో వెలసిందే సిగందూరు చౌడేశ్వరిదేవి ఆలయం.

### నేడు జాతికి అంకితం చేయనున్న కేంద్ర మంత్రి



దేశంలో నాల్గో అతిపెద్ద కేబుల్ స్టేయిడ్ బ్రిడ్జ్‌గా గుర్తింపు పొందిన బిడ్జ్‌ను సోమవారం కేంద్ర భూ ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరి ప్రారంభించనున్నారు. సీఎం సిద్దరామయ్య, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, మాజీ సీఎం యడియూరప్ప, ఎంపీ రాఘవేంద్ర, ఎమ్మెల్యే బేళూరు గోపాలకృష్ణ పాల్గొననున్నారు. బ్రిడ్జ్ ప్రారంభం ప్రదేశంలో విశాలమైన స్థలం లేనందున సభావేదికను సాగర్‌లోని నెహ్రూ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేశారు.

### నెరవేరిన దశాబ్దాల కల

శరావతి నదికి హిరేభాస్కరలో 1939-1948 మధ్యన మైసూరు సంస్థానం నుంచి మడనూరు ప్రాజెక్టు నిర్మించారు. తద్వారా 9,233 ఎకరాల వ్యవసాయ భూమి, 10,240 అటవీ ప్రదేశం ముంపు అయ్యింది. 70 గ్రామాలకు చెందినవారు నిర్వాసితులయ్యారు. 1953-64 మధ్య లింగనమక్కి ప్రాజెక్టు నిర్మించారు. వేలాది ఎకరాల వక్కతోటలు, 12వేల ఎకరాల వ్యవసాయ భూమి, 1750 ఎకరాల నీరావరితోపాటు 80వేల ఎకరాల అటవీభూమి ముంపునకు గురైంది. 157 పల్లెల ప్రజలు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రదేశానికి వెళ్లి జీవనం సాగిస్తున్నారు. అంబారగొడ్లు - కలసవల్లి కల్వర్టుకు దశాబ్దాల కాలంగా పోరాటం సాగుతోంది. 2008లో సీఎంగా ఉన్న యడియూరప్ప రూ.100 కోట్లు కేటాయించారు. కేవలం రాష్ట్ర గ్రాంట్లతో సాధ్యం కాదని భావించారు. కేంద్రం నుంచి నిధులు పొందేందుకు యడియూరప్ప, శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్రలు ప్రయత్నించారు. బైందూరు-రాణిబెన్నూరుల మధ్య 198 కిలోమీటర్ల జాతీయ రహదారి 766గా ప్రకటించారు. 2017-18లో రోడ్డు అభివృద్ధికి రూ.603 కోట్లు కేటాయించారు. సిగందూరు మార్గం జాతీయ రహదారికి పరిధి రాదని కేంద్ర భూ ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ అభ్యంతరం తెలిపింది. యడియూరప్ప చొరవతో సిగందూరు - మరకుటిగ రోడ్డును జాతీయ రహదారి 369ఈగా ప్రకటించారు. దేశంలోనే నాల్గో, కర్ణాటకలో అతిపెద్ద కేబుల్ స్టేయిడ్ బ్రిడ్జ్‌ను రూ.473 కోట్లతో నిర్మించారు. దీంతో సిగందూరు చౌడేశ్వరి దేవిని దర్శించుకునే భక్తుల కోరిక నెరవేరింది.



### వంతెన వివరాలు

| | |
|---|---|
| బ్రిడ్జ్ పొడవు | - 2.12 కిమీ |
| బ్రిడ్జ్ వెడల్పు | - 16 మీటర్లు |
| ఇరువైపులా ఫుట్‌పాత్ | - 1.5 మీటర్లు |
| పునాది | - 164 పైల్స్ |
| పైల్స్‌పై పిల్లర్‌లు | - 18 |
| రహదారి | - 369ఈ |
| టెండరు మొత్తం | - రూ.473 కోట్లు |
| పనులు ప్రారంభం | - 2019 డిసెంబరు 12 |
| నిర్మాణ కంపెనీ | - దిలీప్ బిల్డ్‌కాన్ |

## నేడు ఢిల్లీకి డీకే..!

- శనివారం వెనుదిరిగిన డీసీఎం
- మరోసారి వెళ్తున్నారంటూ ప్రచారం
- వ్యక్తిగతం అంటున్నా.. సర్వత్రా ఉత్కంఠ



బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనపై సందిగ్ధం నెలకొంది. ఢిల్లీ వేదికగా ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, కుర్చీ ఖాళీ లేదని సిద్దరామయ్య ప్రకటించిన తర్వాత ఒక్కసారిగా మౌనంగా మారిపోయిన డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లారు. భార్య ఉషాతోపాటు డీకే శివకుమార్ శనివారం షిర్డీ సాయి బాబా ఆలయాన్ని సందర్శించారు. అక్కడనుంచి పూనె వెళ్లి శనివారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఆ తర్వాత బెంగళూరుకు వెనుదిరిగారు. గతవారంలో రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉన్నా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ లభించలేదు. కేవలం ప్రియాంకగాంధీతో చర్చలు జరిపి డీకే శివకుమార్ వెనుతిరిగారు. ఢిల్లీలో సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యల తర్వాత డీకే శివకుమార్ మౌనంగా మారిపోయారు. సీఎం సమగ్ర వివరాలు తెలిపాక తానేం మాట్లాడతానంటూ దాటవేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి డీకే శివకుమార్ కేపీసీసీ అధ్యక్షుడు అయ్యాకే పార్టీలో ఊపు వచ్చింది. మేకెదాటు పాదయాత్ర, రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్రలు ఆయన సారథ్యంలో విజయవంతం అయ్యాయి. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్‌దాకా జోడో యాత్ర చేసినా కర్ణాటకలో మాత్రమే భారీ స్పందన, విజయవంతమైనట్లు ఏఐసీసీ వర్గాలు ప్రకటించాయి. 2023 శాసనసభ ఎన్నికల్లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన ముఖ్యమంత్రి కావాలని భావిస్తున్నారు. ఈలోగా సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు నేను కొనసాగుతానని, 2028 లోనూ నా సారథ్యంలోనే ఎన్నికలంటూ ప్రకటించడంతో డీకేశీ ఖంగు తిన్నారు. అందుకే అధిష్టానం ఆయనతో ప్రత్యేకంగా చర్చించేందుకు ఢిల్లీకి పిలిచినట్టు తెలుస్తోంది. కాగా ఆదివారం డీకే శివకుమార్ 'ఎక్స్'లో తన వ్యక్తిగత పనులకు వెళ్లినా కూడా రాజకీయంగా ప్రచారం చేయడం సరికాదని పోస్ట్ చేశారు. సోమవారం డీకే శివకుమార్ విజయపుర జిల్లా ఇండి తాలూకాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు షెడ్యూల్ ఖరారైంది. సాయంత్రం ఆయన బెంగళూరుకు వెనుదిరిగి వస్తున్నారు. దీంతో ఆయన ఢిల్లీ పర్యటన ఎప్పుడనేది సందిగ్ధంగా ఉంది. మూడు రోజులుగా డీకే శివకుమార్ మౌనం, ముభావంగానే ఉన్నారు. ఈ పరిణామం ఎటువంటి పరిస్థితికి దారి తీస్తుందనేది పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## బహుభారం..!

- బహుగ్రామ తాగునీటి పథకంలో రూ.11కోట్ల విద్యుత్ బకాయి
- జెస్కాం నోటీసులకు స్పందించని అధికారులు
- సరఫరా నిలిపివేస్తే ప్రజలకు తప్పని ఇబ్బందులు

6


## నటనకు పెట్టని కోట

- కోట శ్రీనివాసరావు మృతికి తెలుగు ప్రముఖుల సంతాపం
- సినీరంగానికి తీరని లోటని అభిప్రాయం

బెంగళూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. నటనలో ఆయన పెట్టని కోట అని, తెలుగులో 45ఏళ్లకుపైగా నటించిన ఆయన మృతి సినీరంగానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. 750 సినిమాల్లో నటించిన కోట శ్రీనివాసరావు ఇటీవల వయోభార ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లో తుదిశ్వాస వీడారు. కోట శ్రీనివాసరావు పలు కన్నడ సినిమాల్లోనూ నటించారు. లేడి కమిషనర్, రక్త కన్నీరు, లవ్, పునీత్‌రాజ్‌కుమార్ హీరోగా నటించిన నమ్మ బసవ, నమ్మణ్ణ, మస్తి, శ్రీమతి కబ్జా వంటి సినిమాలలో విలన్‌తోపాటు పలు క్యారెక్టర్‌లలో రాణించారు. కోట శ్రీనివాసరావు మృతి పట్ల కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నటనారంగంలో పాత్ర ఏదైనా ప్రత్యేకశైలితో కోట అన్నివర్గాలను ఆకట్టుకున్నారని కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

### తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో..

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. హాస్యనటుడిగా, విలన్ పాత్రల్లో కోట తిరుగులేని అభిమానులను పొందారన్నారు. తెలంగాణ మాండలికంలో కోట డైలాగ్‌లు ఆకట్టుకున్నాయన్నారు. తెలుగు విజ్ఞాన సమితి వజ్రోత్సవాల వేళ అప్పటి ఏపీ సీఎం రోశయ్య నుంచి కోట శ్రీనివాసరావుకు శ్రీకృష్ణదేవరాయల పురస్కారం ప్రదానం చేసినట్లు గుర్తు చేసుకున్నారు.



బాగేపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల తాలూకా ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం రిటైర్డు ఉపాధ్యాయుడు, రంగస్థల నటుడు శివశంకరాచారి మాట్లాడుతూ ప్రాణం ఖరీదు సినిమాతో తెలుగుసినీరంగంలో అడుగుపెట్టారని నాలుగు దశాబ్దాలలో తమిళ, కన్నడ, మళయాళం, హిందీ భాషల సినిమాల్లో కూడా నటించారన్నారు. పద్మశ్రీ పురస్కారం, నంది అవార్డులు అందుకున్నారన్నారు. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటు అన్నారు.


భూమిపూజలో కేంద్రమంత్రులు సోమణ్ణ, శోభాకరంద్లాజె తదితరులు

### రైల్వే అండర్‌పాస్ పనులకు భూమిపూజ

బెంగళూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని చల్లఘట్టలో ఎల్‌సీ సంఖ్య 15కు మార్పుకోసం చేపట్టిన రైల్వే అండర్‌పాస్‌ను ప్రారంభించి, రామోహళ్ళిలోని ఎల్‌సీ 16కు మార్పు చేసే నూతన అండర్‌పాస్ పనులకు కేంద్ర రైల్వే సహాయమంత్రి సోమణ్ణ శంకుస్థాపన చేశారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలకు అవసరమైన చోట అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కేంద్ర కార్మిక, ఎంఎస్ఎంఈ మంత్రి శోభాకరంద్లాజె, స్థానిక ప్రముఖులు జవరాయగౌడ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కంప్లి, జూలై13(ఆంధ్రజ్యోతి): కురుగోడు సమీపంలోని కోళూరు క్రాస్ వద్ద ఆదివారం కేఎస్ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో దాదాపు 25 మంది ప్రయాణికులు ఉన్నారు. వేగంగా వస్తున్న బస్సు స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిపడిపోయింది అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు కురుగోడు నుంచి బళ్లారికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.


కోళూరు క్రాస్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు

## గ్యారెంటీల పేరిట... జేబులకు కత్తెర

- సర్కార్‌పై జేడీఎస్ యువ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్‌కుమారస్వామి మండిపాటు

శిడ్లఘట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ పథకాల పేరిట ప్రజలను ఏమారుస్తూ రైతులు, అభివృద్ధి, సంక్షేమాలను విస్మరించారని నిత్యావసర ధరలను నియంత్రించడంలో విఫలం కావడంతో వారి జేబులకు కత్తెర వేస్తున్నారని జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి మండిపడ్డారు. ఆదివారం వర్దాయకనహళ్ళి చీమనహళ్ళి సమీపాన జేడీఎస్ సమావేశం ప్రారంభించి మాట్లాడారు. కార్యకర్తలను ప్రోత్సహించేలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా మిస్డ్ కాల్ ద్వారా పార్టీ సభ్యత్వ నమోదును ప్రోత్సహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డిసెంబరు, జనవరిలో గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీ, జిల్లాపంచాయతీతోపాటు స్థానిక సంస్థలకు కూడా జరగనున్నాయని అవకాశం ఉన్న చోట పోటీ చేసి సత్తా చాటుకోవాలన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పార్టీ అగ్రనేత దేవేగౌడ మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు ప్రజా సేవ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే పలు పాల డెయిరీ, గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులు విజయం సాధించారన్నారు. రానున్న రోజుల్లో మరింత సత్తా పెంచుకోదలిచినట్టు తెలిపారు. తాము కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు, పరిషత్ ఇన్‌చార్జ్ సభ్యుడు గోవిందరాజు, మాజీ ఎమ్మెల్సీ తూపల్లి చౌడరెడ్డి, జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి రోషన్ అబ్బాస్ పాల్గొన్నారు.


సమావేశాన్ని ప్రారంభిస్తున్న నిఖిల్‌కుమారస్వామి

## ఎట్టకేలకు బోనులో చిక్కిన చిరుత..!

రాయచూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గడచిన కొన్ని నెలలుగా రాయచూరు తాలూకా డీ రాంపుర(డొంగ రాంపుర) గ్రామస్థులకు నిద్రహారాలు లేకుండా ఆందోళన పుట్టించిన చిరుతపులి ఎట్టకేలకు ఆదివారం బోనులో చిక్కింది. నాల్గు నెలల క్రితం రాంపుర గ్రామ సమీపంలోని గుట్ట పై సంచరిస్తున్న పులి ఒకటి తరచుగా గ్రామ సమీపంలోని గుడిసెలపై దాడి చేస్తూ మేకలు, ఇతర పశువులను చంపి వేయడం గ్రామస్థులకు ఆందోళనగా మారింది. అనంతరం అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేయగా తప్పించుకు తిరుగుతున్న చిరుత ఇప్పటి వరకు ఎలాంటి అలజడి లేకుండా ఉండగా వారం రోజుల క్రితం గ్రామ సమీపంలోని గుడిసె ముందు కట్టేసి ఉన్న రెండు మేకలను ఎత్తుకెళ్లి తినడంతో మరొక్క సారి గ్రామస్థుల్లో భయాందోళనలు మొదలైయ్యాయి. దీంతో సమస్యను అటవీ శాఖ అధికారుల దృష్టికి తెచ్చిన గ్రామస్థులు రెండు రోజుల క్రితం శనివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో అప్పటికే అటవీ శాఖ అధికారులు గుట్ట సమీపంలో బోను ఏర్పాటు చేయగా ఆదివారం ఉదయం చిరుత బోన్‌లో చిక్కుకున్నట్లు గ్రామస్థులు గుర్తించి తెలిపారు. అక్కడికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు చిరుతను పరిశీలించి దూర ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేపట్టారు.


బోనులో చిక్కుకున్న చిరుత

## చెన్నై మార్గంలో రైళ్ల రద్దు

- తిరువళ్లూరు సమీపంలో భారీ అగ్ని ప్రమాదం
- గూడ్సురైలు పట్టాలు తప్పి 18 ట్యాంకర్లు దగ్ధం
- 900 టన్నుల డీజిల్ బుగ్గిపాలు

చెన్నై, జూలై 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు రైల్వే స్టేషన్ సమీపం ఏకాట్టూరు వద్ద ఆదివారం ఉదయం డీజిల్ ట్యాంకర్లతో వెళుతున్న గూడ్సురైలు పట్టాలు తప్పటంతో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. చెన్నై మనలి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుండి 52 ట్యాంకర్లలో డీజిల్ నింపుకుని గూడ్సురైలు ఆదివారం వేకువజాము మైసూరు బయలుదేరింది. తిరువళ్లూరు రైల్వేస్టేషన్ దాటి వెళుతుండగా ఇంజన్ వెనుకనున్న మూడో ట్యాంకర్ దాని తర్వాత మరో రెండు ట్యాంకర్లు పట్టాలు తప్పాయి. దీంతో 70 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు ఒకదానినొకటి ఢీకొనడంతో ఆ రాపిడికి నిప్పురవ్వలు చెలరేగి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ భారీ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు.

### 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు...

అగ్ని ప్రమాదం కారణంగా ఎనిమిది ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం వేకువజామ 5.50 గంటలకు చెన్నై నుండి మైసూరు బయలుదేరాల్సిన వందే భారత్ రైలు, ఉదయం 6 గంటలకు చెన్నై నుంచి మైసూరు వెళ్ళాల్సిన శతాబ్ది ఎక్స్‌ప్రెస్, ఉదయం 6.10 గంటలకు చెన్నై నుంచి బయలుదేరాల్సిన కోవై ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఇదే విధంగా చెన్నై నుండి ఉదయం 7.15 గంటలకు కోవై బయలుదేరాల్సిన శతాబ్ది ఎక్స్‌ప్రెస్, ఉదయం 6.25 గంటలకు చెన్నై నుండి తిరుపతి బయలుదేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైలు, చెన్నై నుంచి ఉదయం 7.25 గంటలకు బెంగళూరుకు బయలుదేరాల్సిన డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుండి ఉదయం 7.40 గంటలకు బెంగళూరుకు వెళ్ళాల్సిన బృందావన్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి ఉదయం 9.15 గంటలకు మహారాష్ట్రలోని నాగర్‌సోల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


## ఏళ్లు గడిచినా అభివృద్ధికి నోచుకోని సూర్యనగర్ కేహెచ్‌బీ లే అవుట్..!

- రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్

7

## ధర్మస్థళలో మృతదేహాల మిస్టరీ

- పలు అస్తిపంజరాల స్వాధీనం
- యూట్యూబర్‌పై కేసు నమోదు



## తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1625.32 | 1,606.21 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 42,844 | 18.060 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 35,300 | 210 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 77.54 | 30.69 |

## లక్షమంది బాలికలకు టీకా వేయడమే లక్ష్యం

**ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు జయశ్రీ రాజగోపాల్**



బళ్లారి సిటీ,జూలై 13(ఆంధ్రజ్యోతి): లక్ష మంది బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సీన్‌ను ఉచితంగా అందించడమే లక్ష్యమని ఇన్నర్‌వీల్ 316 జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించనున్న జయశ్రీ రాజగోపాల్ అన్నారు. ఆదివారం హొసపేట నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలియోను నిర్మూలించడానికి రోటరీ పనిచేసినట్లే ,ఇన్నర్‌వీల్ కూడా గర్భాశయ క్యాన్సర్‌ను నిర్మూలించడానికి కృషి చేస్తోందన్నారు. రూ.1,200 ఖరీదు చేసే వ్యాక్సీన్ ఖర్చును సంస్థ భరిస్తుందని దీని కోసం కంపెనీల సీఎస్ఆర్ నిధులను ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతాయన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, మంచి చెడు స్పర్శగురించి అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరీరక్షణ,యువత మేథో వికాసం, మార్గదర్శక కార్యక్రమాల ద్వారా ఇన్నర్‌వీల్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

● ఈనెల 16న నగరంలోని ఓ హోటల్ ప్రాంగణంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జాతీయ అధ్యక్షురాలు జ్యోతి మహిపాల్(కోల్‌కతా) జిల్లా మాజీ అధ్యక్షురాలు సుష్మా పతంగే పాల్గొంటారన్నారు. 15న భారత పురావస్తు సర్వేసిబ్బందికి కమలాపూర్‌లో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మేఘనా హిరేమఠ్, రజనీ మానెక్లబ్ అధ్యక్షురాలు నైమిషా, కార్యదర్శి ఆర్తరాజాపూర్, సభ్యురాలు రేఖా ప్రకాశ్ పాల్గొంటారు. 102 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇన్నర్‌వీల్ దేశంలోని 27జిల్లాలను కలిగి ఉంది. జిల్లాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 41 జిల్లాఇన్నర్‌వీల్ క్లబ్‌లు ఉన్నాయన్నారు.

## అపరిశుభ్రంగా డ్రైనేజీ



డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

సిరుగుప్ప, జూలై13(ఆంధ్రజ్యోతి): సోనియా గాంధీ బైపాస్ రోడ్డులో డ్రైనేజీలు కూరుకుపోయినా శానిటరీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఖాదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణానికి చెందిన 26వ వార్డు సోనియా గాంధీ నగర్‌లో బైపాస్ పక్కన వీధుల్లో చెత్తాచెదారం కూరుకుపోయింది. వర్షాకాలంలో మురుగునీరు ప్రవహించక ఎక్కడినీరు అక్కడ ఆగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కౌన్సిలర్‌కు తెలిపినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరసభ అధికారులు తక్షణం దృష్టిసారించి డ్రైనేజీలో పేరుకుపోయినా చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు సక్రమంగా కదిలేలా చూడాలని కోరారు.



కేసీ రోడ్డులో గోతుల మధ్యే ప్రయాణం



రాయల్ సర్కిల్ వద్ద మళ్లింపుతో కేసీ రోడ్డులో తీవ్రమైన రద్దీ

# అడుగడుగునా అవస్థలే..!

● బళ్లారిలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ● టవర్‌క్లాక్ పనులతో ఇబ్బందులు ● తరచూ మళ్లింపులపై వాహనదారుల ఆగ్రహం

బళ్లారి సిటీ,జూలై 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి నడిబొడ్డున నిర్మిస్తున్న టవర్ క్లాక్ నిర్మాణ పనులతో వాహనదారులకు ఇబ్బందులు తీవ్రం అయ్యాయి. ఇదే కాక తరచూ ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వారం పాటు ట్రాఫిక్ తెరిచి, మరో వారం పాటు ట్రాఫిక్ ఆంక్షలు బళ్లారి నడిబొడ్డున ఉన్న గడిగి చెన్నప్ప సర్కిల్ గతి ఇదే. పనులు నిర్వహిస్తున్న వారి బాధ్యతారహితమైన, విచక్షణారహితమైన నిర్ణయాల కారణంగా ఇబ్బంది పడుతున్నట్లు నగరవాసులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండంతో భయం భయంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది.



టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

### అకస్మాత్తుగా మూసివేత

రాయల్ సర్కిల్ ట్రాఫిక్‌ను మూసివేయడానికి ముందు పోలీసు శాఖ , జిల్లాకలెక్టర్ రూట్ మార్పుగురించి ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. ఎటువంటి సమాచారం లేకుండా, సర్కిల్ చుట్టూ అకస్మాత్తుగా బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. దీంతో కేసీ రోడ్డు, కోర్టు రోడ్డు ఇతర రోడ్లతో సహా పరిసర ప్రాంతాలలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఈ ఇరుకైన రోడ్లపై పెద్ద ట్రక్కులు , బస్సులు తిరగడం వల్ల సమస్య మరింత కష్టంగా మారింది. అధికారులు కేసి రోడ్డును తనిఖీ చేశారా?, రాయల్‌సర్కిల్ మూసేసే ముందు కేసీ రోడ్డు పరిస్థితిని తనిఖీ చేయకుండానే ట్రాఫిక్ మళ్లించడంపై స్థానికులు మండి పడుతున్నారు. సంఘం సర్కిల్ నుంచి కేసీ రోడ్డుకు వెళ్ళే మార్గంలో ఓ డ్రెయిన్‌స్లాబ్ విరిగిపోవడంతో రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. గతంలో రోడ్డు ఇరుకుగా ఉండేది. మధ్యలో గుంత ఉండేది, ఇప్పుడు ననగరంలోని అన్ని వాహనాలను సాధారణ ట్రాఫిక్‌ను నిర్వహించలేని రోడ్డు పైకి మళ్ళించారు. పరిస్థితిని సరిగ్గా అంచనా వేసి ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏకపక్ష నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు ఇరువైపుల ఉన్న దుకాణాదారు నాగరాజ్ ఫిర్యాదు చేశారు. జిల్లాయంత్రాంగం, స్థానిక యంత్రాంగం సరిచేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ మార్గంపైనే ప్రయాణిస్తున్నా చర్యలు శూన్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఆసుపత్రిని తనిఖీ చేసిన జడ్పీ సీఈఓ



సండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జడ్పీ సీఈఓ మహ్మద్ హారీస్

బళ్లారి సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): సండూరు పట్టణంలోని 100పడకల తాలూకా పబ్లిక్ ఆసుపత్రిని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ హారీస్ ఆదివారం తనిఖీ చేశారు. ఆయన ఆసుపత్రికి వచ్చిన ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషంట్లతో ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు సకాలంలో ఉత్తమ చికిత్స అందించాలన్నారు. డాక్టర్ జ్యోతి రోగుల సమస్యలపై సరిగ్గా స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయని, సామాన్యుల గతి ఏమిటీ? అని ఆయన ప్రశ్నించారు. పద్దతి మార్చుకోవాలని అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్‌ను ఆదేశించారు. ఆయుష్ వైద్యులపై అతిగా ఆధారపడటం సరికాదని, ఆస్పత్రిలో తాగునీరు సహా ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈసందర్భంగా బీఈఓ అక్కి, తాలూకా పంచాయతీ సహాయ సంచాలకులు రేణుకాచార్యస్వామి, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ చంద్రప్ప, డాక్టర్ బాను, డాక్టర్ విశాంత్, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

## ఇష్టలింగపూజ పవిత్రమైనది

**శ్రీశైల జగద్గురువులు చెన్న సిద్దరామ పండితారాధ్యులు**



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పండితారాధ్యులు

సిరుగుప్ప, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఇష్టలింగపూజ ఎంతో పవిత్రమైనదని శ్రీశైలం జగద్గురువులు చెన్న సిద్దరామ పండితారాధ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం బసవ భవన్ పినాకిని కళ్యాణమండపంలో ఇష్టలింగపూజ సిద్దాంత శిఖామణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని చెన్నసిద్దరామ పండితారాధ్యులు ప్రారంభించారు. సిద్దాంత శిఖామణి తత్వసిద్దాంతాలను ప్రతిఒక్కరు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. భగవంతున్ని స్మరించడమే ఇష్టలింగ పూజ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్యస్వామి, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులు చొక్క బసవన గౌడ, ప్రముఖులు గోపాల్‌రెడ్డి, మల్లికార్జునయ్య, ప్రజలు పాల్గొన్నారు.

## అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం: మంత్రి

రాయచూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి రహీం ఖాన్ అన్నారు. రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించే తాగునీటి చెరువు నిర్మాణ పనులకు ఆదివారం సింధనూరులో మంత్రి భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. సింధనూరు నగర ప్రజలకు రాగల 40 ఏళ్ల వరకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలన్నదే చెరువు నిర్మామణం ఉద్దేశమన్నారు. ఇదే సందర్భంలో కొత్తగా నిర్మించిన సింధనూరు నగర ప్రాధికార అభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రహీం ఖాన్, సీనియర్ నాయకుడైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె చొరవతో 371(జే) అమలులో కొచ్చిందని తద్వార కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని అన్ని నియోజక వర్గాల సమగ్రాభివృద్ధికి బాటలు ఏర్పడ్డాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిబద్దతతో పని చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గడచిన రెండేళ్లుగా అన్ని వర్గాలకు ఆలంబన ఉండేలా అనేక పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు.



సుడా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పురపాలక శాఖ మంత్రి రహీంఖాన్



## బహుభారం..!

● బహుగ్రామ తాగునీటి పథకంలో రూ.11కోట్ల విద్యుత్ బకాయి
● జెస్కాం నోటీసులకు స్పందించని అధికారులు



శివపుర వద్ద నిర్మించిన బహుగ్రామ తాగునీటి సరఫరా యూనిట్

బళ్లారి గాంధీనగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి సరఫరా అవుతున్న 'బహుగ్రామ తాగునీటి పథకం' నిర్వహణకు సంబంధించి కూడ్లిగి తాలూకా పరిధిలి శివపుర వద్ద నీటి శుద్దీకరణ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ నిర్వహణ కోసం ఉపయోగించిన విద్యుత్ బిల్ ఇప్పటి వరకు రూ.11కోట్లు బకాయి ఉన్నట్లు, తద్వారా పావగడ ప్రాంతానికి తాగునీటి సరఫరా నిలిపి వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే పథకం క్రింద కూడ్లిగి తాలూకాకు 218 గ్రామాలతో పాటు హొసపేట తాలూకా, చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు, చెళ్ళకెరె, చిత్రదుర్గ తాలూకాలో 1088 గ్రామాలు, మూడుపట్టణ పంచాయతీ వ్యాప్తిలోని ప్రజలకు నిరంతరంగా తాగునీటి సరఫరా చేయాలని పథకాన్ని ప్రారంభించారు. నీటిని శుద్దీకరణ చేసిన తరువాత నీటిని సరఫరా చేసేందుకు ఈ బృహత్ పంపింగ్ యూనిట్‌ను స్థాపించారు. ఈ యూనిట్ నిర్మాణ పనులు చేపట్టిన ప్రైవేట్ కంపెనీ నిర్వహిస్తోంది. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ పరిధికి చెందుతున్న కారణంగా ఈయూనిట్ నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను గ్రామీణ తాగునీటి సరఫరా శాఖా కార్యనిర్వహక ఇంజనీరు పేరుతో జెస్కాం నుంచి 6.66కేవీ సామర్థ్యం విద్యుత్ సరఫరా అవుతోంది. ఇందుకు ఉపయోగించే విద్యుత్ ఖర్చు ప్రతి నెలకు రూ.60లక్షలకు పైగా బిల్లు వస్తుంది. ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా చెల్లించలేదని తెలుస్తోంది. ఈ బిల్లుపై ఇప్పటివరకు కోటి రూపాయలు వరకు కాగా, అసలు, వడ్డీతో చేరి రూ. 11కోట్లు రూపాయలు బకాయిలు ఉన్నట్లు జెస్కాం అధికారులు తెలుపుతున్నారు. ఈ బకాయి పడ్డ బిల్లు ప్రైవేట్ కంపెనీ చెల్లించాల..? గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ చెల్లించాలా అనే విషయం స్పష్టత లేకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది. విద్యుత్ బకాయిలు చెల్లించాలని జెస్కాం అధికారులు పలుమార్లు నోటీసులు పంపినీ ప్రయోజనం లేదని వాపోతున్నారు.

## జోరుగా నామినేషన్లు



నామినేషన్ వేసేందుకు వచ్చిన సభ్యులు

కంప్లి, జూలై13(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని శిరిగేరి గ్రామంలో ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం సభ్యులు నామినేషన్లు జోరుగా చేపడుతున్నారు. ఈ నెల 25న ఎన్నికలు జరుగుతున్నట్లు ఎన్నికల అధికారి వెంకటేశం తెలిపారు. ఇప్పటివరకు పదిమంది నామినేషన్లు వేశారన్నారు. ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘంలో మొత్తం 278 ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. రుణగ్రహీత కాని సభ్యత్వం నుండి 11 మంది రుణగ్రహీత సభ్యత్వం నుండి ఒక సభ్యులుగా ఎన్నికలు జరుగుతాయన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి 16వ తేదీ చివరి రోజు నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి 18వ తేదీ చివరి రోజు 25న ఎన్నికలు జరుగుతాయని అదే రోజు ఫలితాలు వుంటాయన్నారు. ఈ సందర్భంగా రైతు నాయకులు డ్రైవర్ హులిగప్ప, ఎస్ఎం అడివయ్యస్వామి, మంజునాథస్వామి, వెంకటేష్, లక్ష్మణ్ భండారి, కే ద్యావన్న, యర్రిస్వామి, వి శేఖర్, బి మల్లయ్యనాయక్, అన్వర్ బాషా, వెంకటేష్, శ్రీరామ్, అనిల్ పాల్గొన్నారు.

## దూసుకొచ్చిన మృత్యువు

● ఆగిఉన్న ఆటోను ఢీకొన్న బస్సు
● ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, జూలై 13(ఆంధ్రజ్యోతి): బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. మండలంలోని కల్లూరు సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) దుర్మరణం చెందగా.. ఇద్దరు చిరు వ్యాపారులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదోనికే చెందిన ఉమాదేవి, మరియమ్మ తోపుడుబండ్లపై మొక్కజొన్న కంకులు అమ్ముకునేవారు. మొక్కజొన్న కంకులు తీసుకెళ్లేందుకు మరియమ్మ, ఉమాదేవి, ఖాజామోద్దీన్.. మహమ్మద్ హుస్సేన్ ఆటోను బాడుగకు తీసుకుని, శనివారం రాత్రి అనంతపురం వచ్చారు. మార్కెట్‌లో మొక్కజొన్న కంకులు కొనుగోలు చేసి, ఆటోలో వేసుకుని ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు సమీపాన ఆటో టైరు పంక్చరైంది. మరియమ్మ, ఉమాదేవి ఆటోలోనే కూర్చోగా.. ఖాజామోద్దీన్ రోడ్డు పక్కన లైట్ వేస్తుండగా.. మహమ్మద్ హుస్సేన్ టైరు మార్చుతుండేవాడు. బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు అతివేగంతో రావడంతో లైట్ వేస్తున్న ఖాజామోద్దీన్ పక్కకు పరుగెత్తాడు. ఆటోను బస్సు వేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో పల్టీలు కొట్టింది. అందులో కూర్చున్న మరియమ్మ, ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరియమ్మ, ఉమాదేవిని 108 వాహనంలో అనంతపురం తరలించారు. మహమ్మద్ హుస్సేన్‌కు భార్య యాస్మీన్, నలుగురు పిల్లలు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ గంగాధర్ పరారయ్యాడు. బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# హోసూరు జోన్

## టాపర్లకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

హోసూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో 10, 12 తరగతిలలో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. మెల్విన్‌జోన్స్ అరిమా సంఘం, అప్పావుపిళ్లై పొన్నమ్మాళ్ ఫౌండేషన్, కామరాజ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సంయుక్తంగా కేపీపీ కల్యాణ మండంలో నిర్వహించిన కార్యక్రమంలో టాపర్లను సత్కరించారు. 90శాతం నుంచి 100శాతం సాధించిన సుమారు 500మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందచేశారు. మాజీ ఎమ్మెల్యేయ మనోహరన్, అరిమా శ్రీనివాసన్, ఆడిటర్ బాలసుందరం, ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

హోసూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో పెరిగైలోని పంచాయతీ యూనియన్ తెలుగు ప్రాథమిక పాఠశాలలో గురుపూర్ణిమను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణ రెడ్డి, సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ట్రస్టు కార్యదర్శి డాక్టర్ లాజియా తంబిదురై, పెరవై జిల్లా కార్యదర్శి చిట్టి జగదీశ్, పంచాయతీ మాజీ అధ్యక్షుడు చిన్నపైయా తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో ప్రజలకు మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, మహిళల సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు, కీళ్లనొప్పులు, దంత సమస్యలు, ఈఎన్‌టీ తదితర పరీక్షలు చేశారు. ఆసుపత్రి పీఆర్‌ఓ సెల్వం, మంజునాథ్, శంకర్‌నాయుడు, రవి, రత్నప్ప, ప్రకాశ్, రాజారవి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు



కెలవరపల్లి డ్యాం వద్ద అధికారులు

## తెన్‌పెన్నై నదిలో నీరు కలుషితంపై అధికారుల పరిశీలన

హోసూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని తెన్‌పెన్నై నదిలో కలుషిత నీటిపై జలవనరుల శాఖ కార్యదర్శి జయకాంతన్ దర్యాప్తు చేపట్టారు. తెన్‌పెన్నై నదికి అనుబంధంగా ఉన్న కెలవరపల్లి డ్యాం, సొక్కరసనపల్లి డ్యాంలను ఆదివారం పరిశీలించారు. డ్యాం సామర్థ్యం, నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోతోపాటు నీటి నాణ్యతపై పరిశీలించారు. రసాయన వ్యర్థాలతో నురుగు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెంథిల్‌కుమార్, తమిళనాడు కాలుష్యనియంత్రణ బోర్డు జిల్లా పర్యావరణ ఇంజనీర్ ముత్తురాజ్ పాల్గొన్నారు.

## 'సుడా' అధ్యక్షుడిగా బాబుగౌడ బాదర్లి

రాయచూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు నగరాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడిగా వెంకనగౌడ (బాబుగౌడ బాదర్లి) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సుడా అధ్యక్షుడిగా ప్రభుత్వం బాబుగౌడ బాదర్లిని నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సింధనూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చి విజయోత్సవ జరుపుకున్నారు. సింధనూరులోని అంబాదేవి మఠం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధిచౌక్ మీదుగా సుడా కార్యాలయం వరకు సాగింది. ర్యాలీలో పురపాలిక శాఖ మంత్రి రహీం ఖాన్,ఎంపీ రాజశేఖర్ హిత్నాళ్, ఎమ్మెల్యేలు హంపనగౌడ బాదర్లి, బసనగౌడ ఆర్ తుర్విహాళ్, ఎ.వసంత్ కుమార్ తదితరులున్నారు.

## నది దగ్గరకు వెళ్లవద్దని హెచ్చరిక

కంప్లి, జూలై13(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన హులిగమ్మ దేవి దర్శనానికి వచ్చే భక్తాదులు స్నానానికి నది వద్ద జాగ్రత్త వహించాలని పోలీస్ సిబ్బంది మైకుల ద్వారా తెలియజేస్తున్నారు. జలాశయం నుంచి అధిర మొత్తంలో నదికి నీరు విడుదల చేశారు. నీరు ఆలయంలో తాకుతూ ప్రవహిస్తున్నాయి. భక్తులు స్నానం చేసే సమయంలో అజాగ్రత్త వహిస్తే ప్రాణానికి ముప్పు ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



ఉలిగమ్మదేవి ఆలయం వద్ద మైకులతో పోలీసు సిబ్బంది

## విద్యాసామగ్రి పంపిణీ



నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

బళ్లారి సిటీ,జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ విద్యా శాలలో విద్యార్థులకు అభ్యాస సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి.ఎం.మహంతేశ్ మాట్లాడుతూ కన్నడ మాధ్యమంలో చదివి తదనంతరం ఎంబీబీఎస్ చదివి 2023లో రామయ్య ఆసుపత్రిలో ఎండీ చదువుతున్న డాక్టర్ విశ్వనాథ్ బిదారి అకాల మరణం చెందడం బాధాకరం అన్నారు. డాక్టర్ విశ్వనాథ్ బిదారి వంటి ప్రతిభావంతులైన విద్యార్థి పుట్టినరోజును పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నామన్నారు. ఆయన తల్లి లలిత ముత్తూర్ కోరిక మేరకు మా పాఠశాల విద్యార్థులకు ఆయన జ్ఞాపకార్థం నోట్‌బుక్‌లు, ఇతర అధ్యయన సామాగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. ఆయన కుటుంబాన్నిమా పాఠశాల పరిపాలన, ప్రధానోపాధ్యాయుడు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకున్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంపు...

### గ్రంధి మల్లికార్జున రావు (పుట్టినరోజు)



జీఎంఆర్‌గా చిరపరిచితులైన ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి మల్లికార్జున రావు 1950 జూలై 14న శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రాంతంలో జన్మించారు. రోడ్లు, విద్యుత్, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించి వ్యాపారాలలో ఆయన తనదైన ముద్రను చాటుకున్నారు. 7 దేశాలలో ఆయన వ్యాపారాలు విస్తరించాయి. 2007లో ప్రపంచంలో ధనికుల జాబితాలో 349వ స్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి 2.6 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. 2024లో ఫోర్బ్స్ ప్రకటించిన భారతదేశంలో ధనికుల జాబితాలో 13వ స్థానంలో నిలిచారు. ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్య తదితర రంగాలలో సామాజిక సేవలందిస్తున్నారు. ఇండియాలో 27 చోట్ల, నేపాల్‌లో 2 చోట్ల ఫౌండేషన్ సేవలందిస్తోంది. ఆర్‌బీఐ సెంట్రల్‌బోర్డ్ డైరెక్టర్‌గా 2011 నుంచి 2015 వరకు కొనసాగారు.

### తనికెళ్ల భరణి (పుట్టినరోజు)



రంగస్థల, సినిమా రచయితతో పాటు నటుడిగా రాణించిన తనికెళ్ళ భరణి 1956 జూలై 14న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జగన్నాథపురంలో జన్మించారు. కామెడీ, విలన్, ఉదాత్తమైన వైవిధ్యమైన పాత్రలతో ప్రజాదరణ పొందారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలపై పలు నాటకాలు రాశారు. 'సముద్రం' సినిమా కోసం ఉత్తమ ప్రతినాయకుడిగా నంది పురస్కారం, 'మిథునం' సినిమాకు ఉత్తమ మాటల రచయితగా 2012 నంది పురస్కారం అందుకున్నారు. అంతేకాక శివ భక్తుడిగా పలు ప్రసంగాలు చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. 2024లో వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

### చాగంటి కోటేశ్వరరావు (పుట్టినరోజు)



ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు 1959 జులై 14న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జన్మించారు. మానవ ధర్మంపై ఆసక్తితో అష్టాదశ పురాణాలను అధ్యయనం చేసి తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ భక్తజన మనసులను రంజింపచేస్తున్నారు. సంపూర్ణ రామాయణం, శివ పురాణము, విరాటపర్వం, భాగవతం, సౌందర్యలహరి, రుక్మిణీ కల్యాణం, కనకధారా స్తోత్రం, గోమాత విశిష్టత, భజగోవిందం వంటి వాటిపై అనర్గళంగా ప్రసంగం చేయగలరు. విద్యార్థులలో సైతం సామాజిక స్పృహపట్ల చైతన్యం కల్పిస్తుండడం విశేషం. ప్రవచన చక్రవర్తి, ఉపన్యాస చక్రవర్తి, శారదా జ్ఞానపుత్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారం, ఇంకా గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ప్రవచనాలకు ఎలాంటి పారితోషికం తీసుకోరు. 2024 నవంబరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ సలహాదారుడిగా నియమితులయ్యారు.

## హేబాల్‌కు పెరుగుతున్న ఆదరణ

బెంగళూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): దేశంలో హేబాల్‌కు ఆదరణ పెరుగుతోందని ఒలింపిక్స్‌లో చేర్చే అవకాశం ఉందని ప్రముఖ క్రీడాకారుడు, కోచ్ ప్రణీత్ జే రామచంద్రాని అభిప్రాయపడ్డారు. ఆయన సారథ్యంలో మారిషస్‌లో జరిగిన కామన్వెల్త్ క్యూ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో బంగారుపతకాన్ని విద్యాపిళ్ళై సాధించారు. బెంగళూరులో హేబాల్ అకాడమీ సంస్థాపకులు ప్రణీత్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. 2018 నుంచి విద్యాపిళ్ళైకు కోచింగ్ ప్రారంభించామన్నారు. స్నూకర్‌లో 9, 10 బాల్స్ తరహాలోనే హేబాల్ కూడా ప్రత్యేకమైనదని ఇందులో 8 బాల్స్ ఉంటాయన్నారు. గత ఏడాది డబ్లుపీఏ వరల్డ్ జూనియర్ హేబాల్ పోటీలలో 32దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

## గంగమాంబ ఆలయంలో దీపోత్సవం



అమ్మవారికి విశేష అలంకరణ

ముళబాగిలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపుర రోడ్డులోని పురాణ ప్రసిద్ధ అంజనాద్రి కొండ సమీపంలో వెలసిన తిరుపతి గంగమాంబ దేవాలయంలో దీపోత్సవం, జాతరను పురస్కరించుకుని విశేష పూజలు వైభవంగా జరిగాయి. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ నిర్వహించారు. ముత్తైదువులు జ్యోతులతో తలపై పెట్టుకుని ఊరేగి అమ్మవారికి సమర్పించారు. కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జీ మంజునాథ్ ప్రాయోజకత్వంలో అన్నసంతర్పణ నిర్వహించారు. పూజారి మంజునాథ్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు సాగాయి. నగరసభ సభ్యుడు గరడి శంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఇద్దరిపై కేసు నమోదు

రాయచూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): నగరంలో తప్పుడు ధ్రువపత్రాల ఆధారంగా నివేశన స్థలాలను ఇతరులకు రిజిస్టర్ చేసిన వ్యవహారంలో మరో ఇద్దరు వ్యక్తుల పై ఆదివారం పోలీసులు కేసు (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. నగర పరిధిలో కోట్ల రూపాయిలు విలువ చేసే స్థలాలను తప్పుడు ధ్రువపత్రాల ఆధారంగా మహానగర పాలిక అధికారులు, సబ్ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది కుమ్మక్కై ఇతరులకు విక్రయించినట్లు ఆరోపణలు రాగా విచారించిన అధికారులు ఇప్పటికే పలువురి పై కేసు నమోదు చేశారు. ఎండీ జావీద్, అక్షయ్ కుమార్ భండారిల పై కేసు నమోదు చేశారు.

# అభివృద్ధికి నోచుకోని సూర్యనగర్ లేఅవుట్..!

» రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్



సూర్యనగర్‌లోని కేహెచ్‌బీ లే అవుట్

దొమ్మసంద్ర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకాలో సామాన్యులకోసం కర్ణాటక హౌసింగ్ బోర్డు (కేహెచ్‌బీ) ఆధ్వర్యంలో నిర్మించిన సూర్యనగర్ 1వ స్టేజ్ కొంతమేర అభివృద్ధికి నోచుకున్నా, రెండో, మూడో స్టేజ్‌లు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ తరుణంలో ఇండ్లవాడిలో నాల్గో స్టేజ్‌ను రాష్ట్రప్రభుత్వం చేపట్టింది. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్లు కల్పించేందుకు కర్ణాటక హౌసింగ్ బోర్డు ఉద్దేశించింది. అయితే ఆశించిన స్థాయిలో ప్రగతి లేదనే విమర్శలు ఉన్నాయి. ఇళ్ల లే అవుట్‌లకోసం రైతులనుంచి ఎన్నో ఏళ్లక్రితమే భూసేకరణ చేపట్టింది. వీటిని దశలవారీగా లే అవుట్‌లుగా మార్పు చేసి ఇంటి స్థలాలుగా గానీ లేదా కాలనీల ఇళ్లుగానీ చేపట్టి అభివృద్ధి చేయడం కేహెచ్‌బీ పనిగా ఉంది. రెవెన్యూశాఖ నుంచి 2009లో కేహెచ్‌బీ భూములను పొందింది. హిన్నక్కి గ్రామం సర్వే 474 ఎకరాలు 11 గుంటలు, మరసూరు పంచాయతీ నుంచి 170 ఎకరాలు ఒక గుంట, లింగాపుర గ్రామం నుంచి 110 ఎకరాల 10 గుంటలను మొత్తం 754 ఎకరాలను రైతులనుంచి భూమిని స్వాధీనం చేసుకున్నారు. 15ఏళ్లు గడిచినా అభివృద్ధికి నోచుకోలేదు. సూర్యనగర్ 2వ స్టేజ్‌లో సుమారు 12వేలకుపైగా ఇళ్ల సైట్‌లు ఉన్నా కేవలం 400-500 మాత్రమే ఇళ్లు తలెత్తాయి. ఈ కాలనీకి కూడా సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయనే విమర్శలు ఉన్నాయి.

### స్థానికుల అభిప్రాయాలు...

స్థానికుడు మంజునాథ్ మాట్లాడుతూ ఇక్కడి ప్రాంతానికి ఇన్వెస్టర్‌లు పలువురు వస్తున్నారని, ఈ ప్రాంతానికి సరైన రోడ్లు లేవని, కావేరి తాగునీరు సదుపాయం లేకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడ్డామన్నారు. సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో బీఎంటీసీ బస్సులు కూడా లేవన్నారు. వర్షం కురిస్తే కరెంటు కూడా సజావుగా ఉండదన్నారు. మరో వ్యక్తి స్థానికుడు హరీశ్ గౌతమనంద మాట్లాడుతూ.. హౌసింగ్‌బోర్డులో ఇతర రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులకు కూడా కేటాయించారని, స్థానికులకు కేటాయించలేదన్నారు. కాగా ఒక్కో కుటుంబంలో ముగ్గురికి ఇల్లు కేటాయించారన్నారు. ఈ మార్గంలో లారీల సంచారం అధికమని, త్వరగా రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. రాత్రివేళల్లో పోకిరీల వేధింపులు ఉంటాయన్నారు. విద్యార్థిని హర్షల్ మాట్లాడుతూ 2009లో వేసిన రోడ్లను ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఒకమోస్తరు వర్షానికే కరెంటు తీసేస్తారన్నారు. పోలీస్‌బీట్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేహెచ్‌బీ సహాయక కార్యవర్గ ఇంజనీర్ బోపణ్ణ మాట్లాడుతూ ఇప్పటికే చాలారోజులుగా స్థానికులనుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రెసిడెన్షియల్ ఏరియాలో సిమెంట్ కాంక్రీట్ తయారీని అక్రమంగా తలెత్తడంతో లారీల సంచారం ఉందన్నారు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు టెండరు పిలిచామన్నారు.



దెబ్బతిన్న రోడ్డు

# మతసామరస్యానికి ప్రతీక మల్లసంద్ర గ్రామం

» ఒకే ఆవరణలో పీర్ల చావిడి, ఆలయం



ఒకే ఆవరణలో ఆలయం, పీర్ల చావిడి

బాగేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మల్లసంద్ర గ్రామం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఒకే చావిడిలో పీర్లను కొలువుదీర్చి ఉండగా మరోవైపు ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఏకకాలంలో పీర్లకు ప్రార్థనలు, ఆలయంలో పూజలు కొనసాగే అపురూప దృశ్యం ఇక్కడ చూడవచ్చు. గ్రామంలోని రెండు మతాలవారు చేరి భైరవేశ్వర యువజన సంఘంగా ఏర్పాటు చేశారు. మొహరం పండుగ సందర్భంగా పీర్లకు ప్రార్థనలు చేసి అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇరువర్గాలకు చెందిన యువకులు ఒకేరకమైన వస్త్రధారణతో పాల్గొని గొడుగులు పట్టి, డప్పులకు అనుగుణంగా నృత్యం చేస్తూ సంబరపడతారు. శనివారం రాత్రి పీర్ల ఉత్సవం వైభవంగా జరిగింది. ఇదే గ్రామానికి చెందిన ఆర్టీఓ కమలబాబు మాట్లాడుతూ మల్లసంద్ర గ్రామంలో ఇరువర్గాల ప్రజలు అన్యోన్యంగా ఉన్నారని, కులమతబేధాలు లేవన్నారు. పూర్వీకులనుంచి ఇక్కడ ఐకమత్యం వెల్లివిరిస్తోందని, ప్రస్తుత యువత కూడా అందుకు సహకరిస్తూ అదేబాటలో కొనసాగుతున్నారన్నారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గూగుడు కుగ్రామంలో జరిగే మొహరం వేడుకలు కూడా మత సామరస్యంతో జరుగుతాయని ఇదే తమకు స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామానికి చెందిన మల్లికార్జున్ మాట్లాడుతూ హిందువుల పండుగల కార్యక్రమాల్లో స్థానిక ముస్లింలు కూడా ఉత్సాహంగా పాల్గొంటారని, అలాగే రంజాన్, బక్రీద్ పండుగల వేళ ముస్లిం ఇళ్లలో హిందువులు భోజనం చేస్తారన్నారు. మొహరంను 9రోజులపాటు కలిసికట్టుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



పీర్ల ప్రార్థనల్లో భక్తులు



ఆంజనేయస్వామికి పూజలు

# అక్రమార్కులకు ఆశ్రయం కల్పించవద్దు



వేదికపై బీజేపీ నాయకులు

మహదేవపుర, జూలై 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా వచ్చినవారిని రాష్ట్రంలో ఆశ్రయం కల్పించరాదని, అలాంటివారు ఎవరైనా ఉంటే వారి ఆచూకీ గుర్తించి వాపసు పంపాలని మాజీ మంత్రి అరవింద లింబావళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని రామగొండనహళ్ళి ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంగ్లా దేశ్ అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2013లో తూబరహళ్ళిలో చెత్తను తొలగిస్తున్న ప్రదేశాలను పరిశీలించే వేళ అక్కడ అక్రమంగా బంగ్లా దేశీయులు ఉన్నట్టు స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి అక్రమార్కులను తరలించామని, అయితే మహదేవపుర సహా బెంగళూరు వ్యాప్తంగా పెద్దసంఖ్యలో అక్రమంగా వలస వచ్చారనేది ఊహించ లేదన్నారు. 15రోజులుగా పార్టీ కార్యకర్తలు ప్రత్యేక అబియానలో పాల్గొన్నారని, మన ప్రాంతం స్వచ్ఛంగా ఉండడంతోపాటు సురక్షితంగా ఉండాలనేది లక్ష్యమన్నారు. బాగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కాడుసొణ్ణప్పనహళ్ళి హోసూరు బండె, రాంపురలోని కాడ అగ్రహార మెయిన్ రోడ్డులోని బిదరహళ్ళి, మండూరు, బొమ్మేనహళ్ళి, కాడుగూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొడ్డబనహళ్ళి, చిక్కబనహళ్ళి, కన్నమంగల, శీగేహళ్ళి, ఖాజిసొణ్ణేనహళ్ళి, పట్టందూరు అగ్రహార, సిద్దార్థ లే అవుట్ పలు ప్రాంతాలలో అక్రమంగా బంగ్లా దేశీయులు ఉన్నారనే సమాచారం ఉందన్నారు. బీజేపీ మూడు నెలలక్రితం ప్రారంభించిన వార్ రూంకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,500 ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు. చెత్త, గుజరీ పనులతో పాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇళ్లలో ఇంటిపని, డ్రైవింగ్ వంటి వాటి పనులలో కూడా ఉన్నారనే సమాచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. అక్రమ బంగ్లాదేశీయులకు నకిలీ ఆధార్ కార్డు కూడా ఉన్నాయని వీరికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఐదు బృందాలు పర్యటించి నివేదిక సమర్పించిందని అక్రమ బంగ్లాదేశీయుల సమాచారం ఉందని వీరి వల్ల సమస్యలు తలెత్తక ముందే వారిని సొంత ప్రాంతాలకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంజుళా లింబావళి, కేంద్రమాజీ మంత్రి సిద్దేశ్వర్, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి, కుమార బంగారప్ప, హరిహర ఎమ్మెల్యే బీపీ హరీశ్, మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ శ్రీధర్‌రెడ్డి, కబడ్డి పిళ్ళప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేసీ రోడ్డులో మరమ్మతులు ఇంకెన్నాళ్లు?

బెంగళూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరంలో దాదాపు 20 గంటలు రద్దీగా ఉండే జేసీ రోడ్డులో మరమ్మతు పనులు నెలల తరబడి చేస్తున్నారు. జయనగర్, జేపీనగర్, బనశంకరితోపాటు ఎలక్ట్రానిక్ సిటీ, తమిళనాడు ప్రాంతంనుంచి వచ్చే వేలాది వాహనాలు జేసీ రోడ్డుమీదుగానే మార్కెట్‌వైపు వస్తాయి. తెల్లవారుజామునుంచి రాత్రి పొద్దుపోయేదాకా వాహనసంచారం అత్యధికంగా ఉంటుంది. అటువంటి రద్దీ రోడ్డులో దాదాపు నాలుగైదు నెలలుగా మరమ్మతులు కొనసాగుతున్నాయి. రోడ్డు పూర్తిగా బాగుంటేనే మినర్వ సర్కిల్ నుంచి టౌన్‌హాల్‌కు చేరుకునేందుకు అరకిలోమీటరు దూరానికి కనీసం 10 నిమిషాలు పడుతుంది. అటువంటిది మరమ్మతుల పేరిట పలు గోతులు తవ్వడం, వాటిని సరిచేయకపోవడంతో నిత్యం వేలాదిమంది ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బీబీఎంపీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



జేసీ రోడ్డులో పనులు ఇలా...

## లోక్‌అదాలత్‌లో 693 కేసుల పరిష్కారం

శిడ్లఘట్ట, జూలై 13(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్టలోని జేఎంఎఫ్‌సీ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 693 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి మహ్మద్ రోషన్‌షా తెలిపారు. కోర్టులో కక్షిదారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని లోక్ అదాలత్ ద్వారా రాజీ అయ్యాయన్నారు. అదాలత్ ద్వారా ప్రజలు, కక్షిదారుల మధ్య సత్సంబంధాలు సాధ్యమన్నారు. ఈ సందర్భంగా సివిల్ న్యాయాధికారి సుకన్యా సీఎస్, అదనపు సివిల్ న్యాయాధికారి రంజితా, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అదాలత్‌లో పాల్గొన్న ప్రజలు

## ధర్మస్థళలో మృతదేహాల మిస్టరీ



ఫిర్యాదిదారుడిని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

బెంగళూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా ధర్మస్థళ ప్రాంతంలో మృతదేహాల మిస్టరీ రోజుకో మలుపు తిరుగుతోంది. వారం రోజుల కిందట ధర్మస్థళ పరిసర ప్రాంతాలలో పలు మృతదేహాలను పాతిపెట్టామని ఈ ప్రక్రియ దశాబ్దకాలం జరిగిందని బెళ్తంగడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఈనెల 11న ఫిర్యాదుదారుడిని బెళ్తంగడి తాలూకా జేఎంఎఫ్‌సీ న్యాయాధికారి ఎదుట హాజరుపరిచామన్నారు. 1998 నుంచి 2014 వరకు పారిశుద్ధ విభాగంలో పనిచేశానని ఈ వ్యవధిలో ఉన్నతాధికారుల సూచన మేరకు వందలాది మృతదేహాలను పాతిపెట్టామని న్యాయాధికారి ఎదుట వివరించారు. 2014 నుంచి ప్రాణభయంతో కుటుంబంతో కలసి తలదాచుకున్నామన్నారన్నారు. ఈమేరకు ఆదివారం దక్షిణకన్నడ జిల్లా ఎస్పీ డాక్టర్ అరుణ్ మీడియాతో మాట్లాడుతూ ఫిర్యాదుదారుడిని కోర్టు ముందు హాజరు పరిచామన్నారు. అతడే స్వయంగా అస్థిపంజర అవశేషాలను బయటకు తీస్తానని అంగీకరించాడన్నారు. పలు అస్థిపంజరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతదేహాలను పాతిపెట్టాలని చెప్పినవారు ఎవరు..? ఇంతకు వారు ఎలా చనిపోయారనే కోణంలో విచారణ చేస్తున్నామన్నారు. ఫిర్యాదు దారుడి సమగ్ర వివరాలు రహస్యంగా ఉంచామన్నారు. కాగా ధర్మస్థళ ప్రాంతంలో సౌజన్య హత్య కేసు మాత్రమే కాకుండా మరింతమంది మృతి మిస్టరీగా ఉందని యూట్యూబర్ సమీర్ ఇన్‌స్టాలో పోస్ట్ మేరకు అతడిపై కేసు నమోదు చేశారు.

## 10న నందిహిల్స్ మాన్‌సూన్ రన్




మాన్‌సూన్ రన్ టీ షర్టుల ఆవిష్కరణ

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారు ప్రాంతం నంది హిల్స్ మాన్‌సూన్ రన్ ఆగస్టు 10న నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. జయనగర్ జాగ్వార్స్ ఏటా ఆగస్టు రెండో ఆదివారం దివ్యశ్రీ నందిహిల్స్ మాన్‌సూన్ రన్ పేరిట పోటీలు జరుపుతోందన్నారు. హాఫ్ మారథాన్, 10కే ఛాలెంజ్ వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈమేరకు శనివారం మాన్‌సూన్ రన్‌కు సంబంధించి టీ షర్టులు, బ్యాడ్జ్‌లను విడుదల చేశారు. నంది హిల్స్ అంటే వీకెండ్ విహారయాత్రకు కేంద్రంగా ఉన్న విషయం తెలిసిందే. అత్యంత ఎత్తులో మేఘాల మధ్యన ఆహ్లాదమైన అనుభూతి పొందేందుకు నంది హిల్స్‌కు వెళ్తుంటారు. మాన్‌సూన్ రన్ పేరిట పోటీలు నిర్వహిస్తుండడం వల్ల రన్నర్స్‌కు మరింత ప్రోత్సహించినట్టు కానుంది. కర్ణాటక టూరిజం డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ సహకారం అందిస్తోంది.

## మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయరూ..



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రద్దీ ప్రాంతాలలో ఒకటైన రిచ్‌మండ్ సర్కిల్ నుంచి కార్పొరేషన్ సర్కిల్‌కు వెళ్లే రాజారామ్ మోహన్‌రాయ్ రోడ్డులో టెండర్‌ష్యూర్ పనులలో నిర్మించిన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్‌పై సిమెంటు దిమ్మె తెరుచుకుంది. ఏమాత్రం అదుపు తప్పినా వాహనచోదకులు అంతే పరిస్థితి. స్థానికులు దీన్ని తప్పించేలా థర్మోకోల్ బాక్స్‌లో కర్రలువేసి అడ్డుగా పెట్టారు.

## చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రముఖులకు సన్మానాలు

విజయనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్‌నగర్ మెయిన్‌రోడ్డు రాయపురలోని పీటర్ అండ్ పాల్ చర్చ్‌లో సంత రాయప్ప, చిన్నరాయప్ప సంక్షేమ సేవాసంఘం 75వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మేరీ మాత, బాల ఏసులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ప్రధాన రహదారిపై ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ సమాజసేవకులు ఈశ్వర్ ఎస్ రాయుడు, చర్చ్ కార్యవర్గ సభ్యులు భాస్కర్‌బాబు, ఆనంద్, సుబ్బరాయుడు, ముబారక్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా స్థానిక ప్రముఖులను ఆత్మీయంగా సత్కరించారు.